పార్కింగ్.. పరేషాన్

- హైవేపైనే నిలుపుతున్న వాహనాలు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు
- పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని పలువురి డిమాండ్


గుడెప్పాడ్ జంక్షన్‌లో హైవేపై పార్కింగ్ చేసిన లారీలు

ఆత్మకూరు : మండల పరిధిలోని జాతీయ రహదారిపై భారీ వాహనాలతో పాటు ఇతర వాహనాల డ్రైవర్లు హైవేపైనే నిలుపుతున్నారు. వాహనాలను పార్కింగ్ చేసేందుకు స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే నిలుపాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే రాత్రి సమయంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతుందని ఇతర వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని గుడెప్పాడ్ జంక్షన్ ఓ వైపు ఇరుకుగా ఉన్న కారణంగా వాహనాలను పార్కింగ్ చేయడంతో పరిస్థితి ఇబ్బందికరంగా మారుతుందని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుండడంతో ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతుందని, లారీలు పార్క్ చేయడంతో బస్సుల్లో ఎక్కేందుకు ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదని పలువురు వాపోతున్నారు. గతంలో లారీల పార్కింగ్‌తో అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయని అంటున్నారు. లారీ డ్రైవర్లు అధిక దూరం ప్రయాణిస్తున్నారని, విశ్రాంతి కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో రోడ్డుపైనే నిలుపుతున్నారని, దాంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు నిలుపేందుకు గతంలో ప్రత్యేక స్థలాలు ఏర్పాటు చేయాలని పలువురు డిమాండ్ చేసినప్పటికీ ఫలితం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- ఎస్సై సతీష్


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై సతీష్

ఆత్మకూరు : రోడ్డు భద్రతా నియమ, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై సతీష్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై సోమవారం ఆయన వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లాల్సి వస్తుందన్నారు. ప్రతీ వాహనదారుడు సరైన పత్రాలు కలిగి ఉండాలని అన్నారు. తనిఖీల్లో సిబ్బంది కనకరాజు, శ్రీనివాస్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

- మాజీ జెడ్పీటీసీ నారాయణరెడ్డి


విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న నారాయణరెడ్డి, తదితరులు

శాయంపేట : ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య లభిస్తుందని మాజీ జెడ్పీటీసీ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొప్పుల గ్రామంలో గల (గొల్లపల్లి) ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన మాజీ కో ఆప్షన్ సభ్యుడు వైనాల రాజేందర్ నోట్‌బుక్స్‌లు, బ్యాగులు, ప్లేట్లు, గ్లాసులు, షూలు అందించగా ఆయన హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు పాఠాలు బోధించడంతో పాటు క్రమశిక్షణ నేర్పిస్తారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందిస్తున్నట్లు తెలిపారు. కొన్నేళ్లుగా మూసిఉన్న ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం కావడం విద్యార్థుల అదృష్టమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించిన ప్రత్యేక శ్రద్ధ చూపి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 15 మంది విద్యార్థులను చేర్పించిన ఎమ్మార్పీ మండల అధ్యక్షుడు భాస్కర్, ఎంఈఓ గడ్డం భిక్షపతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్‌ను అభినందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులకు నోటుబుక్కులు, బ్యాగులు, ప్లేట్లు, గ్లాసులు, షూ అందించిన వైనాల రాజేందర్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుమారస్వామి, విద్యా కమిటీ చైర్ పర్సన్ మామిడి ప్రియ, నాయకులు సమ్మిరెడ్డి, రాజయ్య, జగన్, సాయిరాం, రవీందర్‌తో పాటు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

- ఏపీడీ శ్రీనివాస్


రికార్డులు తనిఖీ చేస్తున్న ఏపీడీ శ్రీనివాస్

నడికూడ : ఉపాధి హామీ సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఏపీడీ శ్రీనివాస్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నాల్గో విడుత సామాజిక తనిఖీ ప్రజా వేదిక జరిగింది. మండలంలోని అన్ని గ్రామాల్లో 2024–2025 సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై సమగ్ర సమాచారంపై చర్చించారు. ఈ సందర్భంగా ఏపీడీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. లెక్కలో తేడా వచ్చిన కారణంగా రూ.25,719 సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది నుంచి రికవరీ చేయనున్నట్లు చెప్పారు. రికార్డుల్లో తప్పులు దొర్లకుండా చూడాలని అన్నారు. వివరాల సేకరణలో నిర్లక్ష్యం వహించినవారికి జరిమానా విధించినట్లు తెలిపారు. ఎంపీడీఓ విమల, ఎంపీఓ రవి, ఏపీఓ విద్యావతి, ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈలు శ్రీలత, ఉదయ్‌కుమార్, పుష్పలత, అజీమ్, రజనీకాంత్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశం

నర్సంపేట రూరల్ : 'రైతాంగ ఉద్యమాలు–ఓంకార్ పాత్ర' అంశంపై నేడు (మంగళవారం) నర్సంపేట మండలంలోని మాధన్నపేటలో ఎంసీపీఐ(యూ), ఏఐకేఎఫ్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంసీపీఐ(యూ) నర్సంపేట డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల, ప్రజాసంఘాల నాయకులను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. వ్యవసాయ రంగంతోపాటు దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని తెలిపారు. సమావేశాన్ని విజయవంతం చేయాలని రాజకీయ పార్టీల, ప్రజాసంఘాల నాయకులను కోరారు.

బాధితురాలికి ఇల్లు మంజూరు చేయిస్తాం

నర్సంపేట : వర్షాల కారణంగా చెన్నారావుపేట మండలంలోని జీడిగడ్డతండాకు చెందిన భూక్య బిబ్లీ ఇల్లు నేలకూలిన క్రమంలో బాధితురాలికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తామని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్, లింగాపురం మాజీ సర్పంచ్ తప్పెర రమేశ్ భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు బాధితురాలి ఇంటిని రమేశ్ ఆధ్వర్యంలోని బృందం సోమవారం సందర్శించి పరిశీలించింది. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడారు. బాధితురాలిని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు పెరుమాండ్ల మల్లారెడ్డి, జీడిగడ్డతండా గ్రామ కమిటీ అధ్యక్షుడు గుగులోతు బొంద్యాలు, నాయకులు సూదన్‌రెడ్డి, భిక్షపతి, గుగులోతు శ్రీను, భూక్య శ్రీను, గుగులోతు లచ్చిరాం, గుగులోతు వీరస్వామి, భూక్య రాములు, గుగులోతు హరి, గుగులోతు నర్సింహ, నూనావత్ విష్ణు, నూనావత్ రవి పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ వాహనాల ప్రారంభం

- హాజరుకానున్న ఎమ్మెల్యే 'రేవూరి'


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వాహనాలు

పరకాల : మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మంగళవారం మున్సిపల్ వాహనాలను ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు కమిషనర్ సుష్మ సోమవారం ప్రకటనలో తెలిపారు. 15 ఆర్థిక సంఘం టైడ్ గ్రాంట్స్ ద్వారా రూ.47.74లక్షల నిధులతో జేసీబీ, రూ.87.55లక్షలతో కొనుగోలు చేసిన ఆరు స్వచ్ఛ వాహనాలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మహిళా సంఘాలచే మెప్మా ఆధ్వర్యంలో ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి హాజరుకానున్నట్లు వెల్లడించారు.

సంక్షిప్తంగా

కేజీబీవీలో స్పాట్ అడ్మిషన్లు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని కేజీబీవీలో మిగిలిన సీట్లను భర్తీకి స్పాట్ అడ్మిషన్లు ఇస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ వాసవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 8 సీట్లు, ఇంటర్మీడియట్ బైపీసీలో 6 సీట్లు, ఎంపీసీలో 9 సీట్లను భర్తీ చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. మండలంలోని విద్యార్థినుల తల్లిదండ్రులు దరఖాస్తు చేయాలని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

గెస్ట్ టీచర్ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

వేలేరు : మండలంలోని కేజీబీవీ జూనియర్ కళాశాలలో జువాలజీ సబ్జెక్ట్ బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్రవంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎంఎస్సీ జువాలజీ, బీఈడీ పూర్తి చేసిన మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు 6302494148 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

దామెర : మండలంలోని ఊరుగొండకు చెందిన మోతె బాలకృష్ణ ఇటీవల పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు పగడాల కాళీప్రసాదరావు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మధుకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. భారత మిస్సైల్ మ్యాన్‌గా పిలిచే డాక్టర్ అబ్దుల్ కలాం పదో వర్ధంతిని పురస్కరించుకుని నివాసయోగ్యమైన భూగోళ పరిరక్షణ అనే అంశంపై సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, లీడ్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి 9 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎన్నికయ్యారు. ఇదే అంశాలపై ఫాతిమా నగర్‌లోని బాలవికాస కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సులో విద్యార్థులు ప్రశంసపత్రాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం ధర్మప్రకాశ్, ఉపాధ్యాయులు కవిత పద్మజ, ప్రసన్న, రమ్యశ్రీ, సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం


కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

సంగెం : కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టిబొమ్మను సోమవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి మాట్లాడారు. పరకాలలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చేపట్టిన కుట్టమిషన్ల పంపిణీ కార్యక్రమంలో కేటీఆర్ అనుచిత, అహంకార పూరిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ దిష్టిబొమ్మ దహనం చేసినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, కేటీఆర్ వాస్తవాలను విస్మరించి యూరియాపై అబద్ధాలు ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. నల్లబెల్లి సొసైటీలో యూరియా అక్రమ రవాణను కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందని గుర్తు చేశారు. ప్రమేయం లేకున్నా మహిళా రైతుపై నాన్ బెలబుల్ కేసు పెట్టినట్లు, జైలుకు తరలించినట్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎఫ్ఐఆర్ పరిశీలించాలని హితవు పలికారు. కాంగ్రెస్‌ను, ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డిని బద్నాం చేసేలా వ్యాఖ్యలు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు.

ప్రజాదరణ ఓర్వలేకే సీఎంపై విమర్శలు

నర్సంపేట : కాంగ్రెస్ ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను ఓర్వలేకే సీఎం రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శలు చేశారని నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నన్నెబోయిన రమేశ్ యాదవ్ అన్నారు. చెన్నారావుపేటలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

'స్థానిక' ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటరమణ

నెక్కొండ : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వన్నాల వెంకటరమణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ పదవులకు పార్టీ తరపున బరిలో నిలిచే వారిని గెలిపించేలా బూత్ స్థాయి నుంచి మండల కమిటీ వరకు ప్రతీఒక్కరు కృషి చేయాలాని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షురాలు అనూష అశోక్, ఉపాధ్యక్షులు దామరచర్ల రామారావు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నర్సంపేట రూరల్ : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2025 పోటీలో నర్సంపేటలోని బాలాజీ టెక్నో స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. సదరు విద్యార్థులను స్కూల్ ఆవరణలో చైర్మన్ రాజేంద్రప్రసాద్‌రెడ్డితో కలిసి ప్రిన్సిపాల్ సోమవారం అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడారు. పోటీల్లో స్కూల్ నుంచి 30 మంది పాల్గొనగా 17మంది వివిధ విభాగాల్లో బంగారు, కాంస్య, రజత పతకాలు సాధించారని చెప్పారు. శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు భవానీ నిచంద్, పార్వతి, వినోద్ అభినందించారు.

భజన మండలి సభ్యుల నగరసంకీర్తన



శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన శ్రీరామాంజనేయ భజన మండలి సభ్యులు, శ్రీ రామదాసు భజన జిల్లా అధ్యక్షుడు మాందాడి రాజు ఆధ్వర్యంలో నగర సంకీర్తన చేపట్టారు. శ్రావణ మాసం, శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని సోమవారం ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు గ్రామంలోని పలు వీధుల్లో తిరుగుతూ భక్తి గీతాలు ఆలపించారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికి స్వామివారి ఆశీర్వాదం పొందారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు సదానందం, కుమారస్వామి, రమేశ్, మహేందర్, సాంబరెడ్డి, రవి, ప్రభాకర్‌రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి

- మండల అధ్యక్షుడు ప్రణయ్


మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఐనవోలు : గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మాదాసు ప్రణయ్ అన్నారు. ఐనవోలు నుంచి రాంనగర్ వరకు ప్రధానమంత్రి సడక్ యోజనలో బీటీ రోడ్డు పూర్తికాగా సోమవారం బీజేపీ నాయకులు సందర్శించి మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ప్రణయ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల్లో హరితహారం, పల్లె ప్రకృతివనం, వైకుంఠదామం తదితర పనులు జరిగాయన్నారు. కేంద్రం నిధులతోనే పేదలకు రేషన్ బియ్యం అందుతున్నట్లు తెలిపారు. వ్యక్తిగత వ్యాపారాల అభివృద్ధికి బ్యాంకు ద్వారా ముద్ర లోన్స్ అందిస్తున్నట్లు చెకప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బీజేపీని ఆదరించాలని కోరారు. జిల్లా కోశాధికారి మహేశ్వర్, రాజు, రాజేశ్, నర్సయ్య, కుమారస్వామి, లలిత, శ్రీకాంత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల సదస్సును జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న రవికుమార్

దామెర : చేయూత పింఛన్‌దారుల జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోవిందు రవికుమార్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని కోగిల్వాయిలో పింఛన్‌దారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆసరా పింఛన్‌దారులకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు, కండరాల క్షీణత బాధితులకు రూ.15వేలు వెంటనే చెల్లించాలన్నారు. అదే విధంగా ఆగస్టు 13న హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన ఆసరా పింఛన్‌దారుల మహాగర్జన సభకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వికలాంగుల పోరాట సమితి గ్రామ అధ్యక్షుడు సమ్మయ్య, నాయకులు కుమారస్వామి, లచ్చమ్మ, కొమురమ్మ, మల్లయ్య, సమ్మయ్య, చిన్నయ్య, రాజయ్య, నవీన్, ప్రదీప్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


మాట్లాడుతున్న హెచ్ఈఓ వెంకటేశ్వర్లు

వేలేరు : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా చూడాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్ఈఓ వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని సబర్మతి పాఠశాలలో విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దోమలు వృద్ధి చెందకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా తదితర వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరిసరాల పరిశుభ్రతే కాకుండా వ్యక్తిగత పరిశుభ్రత కూడా పాటించాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ కుమారస్వామి, పాఠశాల హెచ్ఎం సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యం

పర్వతగిరి : మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఈజీఎస్ ఏపీడీ కృష్ణవేణి, మార్కెటింగ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) ఎం.ఎల్లేష్ తెలిపారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ రూర్బన్ మిషన్ ఫేస్–3లో భాగంగా మండలంలోని కొంకపాకలో నిర్మించిన 3 వేల మెట్రిక్ టన్నుల వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేయగల సామర్థ్యంతో నిర్మించిన గిడ్డంగిని మదర్ థెరిస్సా మండల సమాఖ్య కోశాధికారి ఫరీదా బేగంకు ఏపీడీ కృష్ణవేణి, ఎల్లేష్ సోమవారం అప్పగించారు. అలాగే ఏనుగల్‌లో నిర్మించిన 2 వేల మెట్రిక్ టన్నుల నిల్వ చేయగల సామర్థ్యం కలిగిన గిడ్డంగిని పర్వతగిరికి చెందిన సూర్యోదయ ఎఫ్‌పీసీ అధ్యక్షురాలు కవితకు అప్పగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీఎం తోటకూరి కృష్ణమూర్తి, సీనియర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, ఎంపీఈఓ శేషుకుమార్, ఎఫ్‌పీసీ వైస్ చైర్మన్ సరిత, సీసీలు సుధాకర్, రవీందర్‌రాజు, ఎఫ్‌పీసీ సీఈఓ శ్రీనివాస్, ఎంఎస్ సిబ్బంది రాధిక, అరుణ, వీఓఏలు విజేందర్, రాజు, సంధ్య, రమేశ్, జ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్లు మహేందర్, రజిత, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అవగాహనతోనే ఓటుహక్కు వినియోగం



ఖానాపురం : విద్యార్థులకు అవగాహన ఉంటేనే ఓటుహక్కు వినియోగించుకోగలరని బుధరావుపేటలోని తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పెరక సునీత తెలిపారు. స్కూల్‌లో సోమవారం హెడ్ బాయ్, హెడ్ గర్ల్, కల్చరల్ కమిటీ, డిసిప్లిన్ కమిటీ, స్పోర్ట్స్ కమిటీ, తదితర విభాగాలకు ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నామినేషన్ దాఖలు చేయడంతోపాటు ప్రచారాలు నిర్వహించారు. పోలింగ్ ఆఫీసర్లు, బూత్ ఏజెంట్లు, కౌంటింగ్ వంటి కార్యక్రలాపాలు చేపట్టారు. విద్యార్థులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సునీత మాట్లాడారు. భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఇలాంటి ఎన్నికలు ప్రజాస్వామ్య విలువలను బోధించడంలో కీలకపాత్ర పోశిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేందర్ పాల్గొన్నారు.

ముందస్తు స్క్రీనింగ్‌తో టీబీ కట్టడి



వర్ధన్నపేట : ముందస్తుగా స్క్రీనింగ్ పరీక్షలు చేసుకోవడం ద్వారా టీబీ వ్యాధిని కట్టడి చేయొచ్చని పల్లె దవాఖానా వైద్యాధికారి నిఖిల్ తెలిపారు. టీబీ ముక్త్ అభియాన్‌లో భాగంగా మండలంలోని ఉప్పరపల్లిలో సోమవారం నిర్వహించిన వైద్యశిబిరంలో పలువురికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అఖిల్ మాట్లాడారు. పరీక్షలు నిర్వహించగా 65 మందిని ప్రాథమిక టీబీ అనుమానితులుగా గుర్తించినట్లు తెలిపారు. వారి నమూనాలను పరీక్షలకు పంపించడంతోపాటు వారిలో 38 మందిని ఎక్స్‌రే కోసం సీహెచ్‌సీకి పంపించనున్నట్లు చెప్పారు. టీబీ పూర్తిగా నయమయ్యే వ్యాధి అని తెలిపారు. సకాలంలో గుర్తిస్తే మందులతో కట్టడి చేయొచ్చని తెలిపారు. శిబిరంలో సీహెచ్ఓ జ్ఞాన సుందరి, పీహెచ్ఎన్ కమల గ్రేస్, సూపర్‌వైజర్ రాజు, హెల్త్ అసిస్టెంట్ మథ్యాస్, స్వర్ణలత, ఎస్టీఎల్ఎస్ రంజిత్, శ్రీనివాస్, ఏఎన్ఎం రాణి, ఆశవర్కర్లు చైతన్య, సంధ్య, రమ్య, మాధవి, రేణుక, రజియా, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ కీలకం



పర్వతగిరి : జీవితంలో విద్యార్థి దశ కీలకమని ఎస్సై ప్రవీణ్ అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్/కాలేజీలో జాగృతి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని, ప్రణాళికాయుతంగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రుల కీర్తిప్రతిష్టలు ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. గంజాయి, గుట్కా, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చెప్పారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, డయల్ 100, షీ టీమ్స్, ఈవ్ టీజింగ్, హ్యూమన్ ట్రాఫికింగ్, తదితరాల గురించి వివరించారు. అనంతరం గంజాయి, మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్/కాలేజీ ప్రిన్సిపాల్, ఎంఈఓ, జాగృతి కళాబృందం ఇన్‌చార్జ్ నాగమణి, సభ్యులు విలియమ్స్, వెంకటేశ్వర్లు, పూల్‌సింగ్, శ్రీనివాస్, నారాయణ, విక్రమ్ రాజు, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

'కేటీఆర్ దిగజారి మాట్లాడుతున్నారు'

హసన్‌పర్తి: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామావు తన స్థాయి మరిచి దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే నాగరాజు విమర్శించారు. నగరంలోని 56వ డివిజన్ పరిమల కాలనీ, సురేంద్రపురి కాలనీ, పెగడపల్లిలో సుమారు రూ.1.10 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కేటీఆర్ ఏకవాచనంతో సంబోధించడం సరికాదని అన్నారు. వరంగల్‌ను రెండో రాజధానిగా ఏర్పాటు చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సిరంగి సునీల్‌కుమార్, అరుణకుమారి, జక్కుల రజిత, డివిజన్ అధ్యక్షులు కొంక హరిబాబు, శివరాం, వెంకటరమణ, మణీంధర్‌నాథ్, ఎన్ఎస్‌యూ జిల్లా మాజీ అధ్యక్షుడు వీసం సురేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ దేవరకొండ అనిల్, స్థానికులు పాల్గొన్నారు.